రీలొకేషన్‌కు రూ.46 లక్షలు

- సిగ్నల్ గడ్డలో మహనీయుల విగ్రహాల తొలగింపునకు నిధుల కేటాయింపు
- మున్సిపల్, రెవెన్యూ, పోలీసు అధికారులకు అదనపు కలెక్టర్ లేఖ
- పునఃప్రతిష్టాపనపై నేటికీ కొరవడని స్పష్టత
- విగ్రహాలు అలాగే ఉంచి రోడ్డు పనులు కొనసాగిస్తున్న కాంట్రాక్టర్


అంబేద్కర్, పూలే విగ్రహాల చుట్టూ కొనసాగుతున్న మట్టి పనులు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలో 167వ నెంబరు జాతీయ రహదారి విస్తరణ పనులు నిత్యవివాదాలకు నిలయంగా మారింది. మొదట వాల్‌తో కూడిన ఫ్లెటైవర్ మంజూరు కాగా.. 'సాక్షి' సహకారంతో స్థానికులు వెలుగులోకి తీసుకొచ్చి దానిని రద్దు చేయించుకున్నారు. తర్వాత నాలుగు లైన్ల రహదారిగా మార్చినప్పటికీ ఇప్పుడున్న అంబేద్కర్ కూడలి నుంచి నేరుగా పాతబజార్‌కు రాకపోకలు సాగించే వీల్లేదని ఇటీవల మరో వివాదం తెరపైకి వచ్చింది. అయితే అందరి అభిప్రాయాలను కొనసాగిస్తూ.. పాతబజార్‌కు ఎప్పటిలాగే రాకపోకలు సాగించేలా చేయడంతో ఆ వివాదం కాస్త సద్దుమణిగింది. ఇక మిగిలింది మహనీయుల విగ్రహాల తరలింపు, పునఃప్రతిష్టకు సంబంధించిన అంశం. నెలల తరబడి దీనిపై రాద్ధాంతం రేగుతున్నప్పటికీ నేటికి ముగింపు పలకలేదు సరికదా విగ్రహాల రీలొకేషన్ కోసం రూ.46లక్షలు మంజూరు చేయడం మరో వివాదానికి తెరలేపుతున్నాయి. ప్రస్తుతం సిగ్నల్‌గడ్డపై అటు నెహ్రూ ఇందిర చౌరస్తా, ఇటు అంబేద్కర్ పూలే చౌరస్తాల్లో మహనీయుల విగ్రహాలు అలాగే ఉంచి రోడ్డు పనులు చేస్తున్నారు. విగ్రహాల చుట్టూ మట్టి వేస్తూ డోజర్ సహాయంతో చదును చేస్తూ రోలర్‌తో లెవల్ చేస్తున్నారు.

విగ్రహాల తొలగింపునకు ఆదేశాలు

రోడ్డు విస్తరణలో భాగంగా సిగ్నల్‌గడ్డపై ఉన్న ఐదు విగ్రహాలకు సంబంధించి రూ.46లక్షలతో రీలొకేషన్‌కు నిధులు కేటాయించినట్లు అదనపు కలెక్టర్ మోహన్‌రావు స్థానిక మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, పోలీసులకు లేఖను పంపించారు. జాతీయ రహదారుల శాఖ ఎస్ఈ ద్వారా తనకు అందిన లేఖ ద్వారా విగ్రహాల తొలగింపుతోపాటు పునఃప్రతిష్టకు చర్యలు తీసుకోవాలని వారిని ఆదేశించారు. జాతీయ రహదారుల శాఖ కేటాయించిన ప్రకారం అంబేద్కర్ విగ్రహానికి రూ.17, 42, 444, శ్రీకాంతాచారి విగ్రహానికి రూ.5,33, 859, ఇందిరా గాంధీ విగ్రహానికి రూ.7,75,581, నెహ్రూ విగ్రహం కోసం రూ.3, 37, 567, పూలే విగ్రహం కోసం రూ.61, 142గా నిర్ణయించారు. ఇందిర చౌరస్తాలో ఉన్న పైలాన్ తొలగింపు కొత్తగా ఏర్పాటుకు రూ.3, 95, 162లు కేటాయించారు. వీటికి తోడు జీఎస్టీ రూ.6, 92, 240, సీనరేజస్ చార్జీలకు రూ.31, 186, విద్యుత్, ఇతర పరికరాలకు రూ.30, 799 కలిపి మొత్తం రూ.46లక్షలు కేటాయించారు.

తొలగింపు, పునఃప్రతిష్ట

రహదారి విస్తరణ పనులకు ఆటంకం లేకుండా వెంటనే విగ్రహాలను తొలగించాలని, అదేవిధంగా వాటిని పునఃప్రతిష్ట చేసేందుకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ లేఖలో సూచించారు.

కొరవడిన స్పష్టత

మహనీయుల విగ్రహాలను తరలించి ఎక్కడ ప్రతిష్ట చేయాలనే అంశం ముడిపడి ఉండటంతో స్పష్టత కొరవడింది. ప్రస్తుతం ఉన్నట్లుగానే విగ్రహాలు ఉండాలని ప్రజాసంఘాలు పట్టుబట్టడంతో అధికారులకు ఏం చేయాలో పాలుపోకుండా ఉంది. కాంట్రాక్టర్ సైతం విగ్రహాలను వదిలేసి చుట్టూ మట్టి పనులు చేసుకుంటూ వెళ్తున్నాడు. ఇప్పటికే రోడ్డు దాదాపుగా మట్టి వేయటం పూర్తికావొస్తుంది. విగ్రహాల పునఃప్రతిష్ట విషయంలో ప్రజాసంఘాలతో అధికారులు సమావేశం నిర్వహించి ఏకాభిప్రాయానికి తీసుకొచ్చి విగ్రహాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి. రోడ్డు పనులు పూర్తయ్యాక తిరిగి పునఃప్రతిష్ట చేసే అంశంపై చర్చించాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.

పూలే విగ్రహానికి అన్యాయం

విగ్రహాల తొలగింపు, పునఃప్రతిష్టకు జాతీయ రహదారుల శాఖ కేటాయించిన నిధుల్లో జ్యోతిరావు పూలే విగ్రహానికి అన్యాయం జరిగిందని బీసీ సంఘాలు మండిపడుతున్నాయి. కేవలం రూ.61వేలు కేటాయించడమేమిటని ప్రశ్నిస్తున్నారు.


తొలగించాల్సిన శ్రీకాంతాచారి విగ్రహం

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


అప్పంపల్లిలో ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జీఎమ్మార్

చిన్నచింతకుంట: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభు త్వం లక్ష్యమని ఎమ్మెల్యే జీ. మధుసూదన్‌రెడ్డి అ న్నారు. ఆదివారం కొౌకుంట్ల మండలం అప్పంపల్లి లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి భూమిపూజ చేశారు. అనంతరం పనులు ప్రారంభించారు. అంతకుముందు కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. అందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరంలోపే నియోజకవర్గానికి 3,500 ఇడ్లు మంజూరు చేసిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు బోయ నర్సింహులు, నాయకులు సుదర్శన్, శ్రీనివాస్‌రెడ్డి, శాంతిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, రాఘవరెడ్డి, సీతన్న, శ్రీను, రాజారెడ్డి, వెంకట్‌రెడ్డి, రవి, చందుతోపాటు పలువురు ఉన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఒక వరం

దేవరకద్ర: ఉపాధ్యాయ వృత్తి ఒక వరం లాంటిదని.. భావి భారత పౌరులను తీర్చిదిద్దే అవకాశం లభిస్తుందని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం దేవరకద్ర శ్రీనివాసగార్డెన్‌లో డోకూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన కొండా దమయంతి సన్మానసభలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కొండ దమయంతి, గోవర్ధన్‌రెడ్డి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ చైర్మన్ సీతాదయాకర్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, ఎంఈఓ బలరాం, దేవరకద్ర, కొౌకుంట్ల మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమష్టి పోరాటంతోనే సమస్యల పరిష్కారం


గ్రామ కమిటీని ప్రకటిస్తున్న జిల్లా కమిటీ సభ్యులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సమష్టి పోరాటంతోనే ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కారమవుతా యని ముదిరాజ్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్‌రూరల్ మండలంలోని కోడూర్ ముదిరాజ్ మహాసభ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా కుర్మయ్య, చెన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా నాగన్న, సహాయ కార్యదర్శులుగా విజయ్‌కుమార్, గంగన్న, కార్యవర్గ సభ్యులుగా నర్సింహులు, కుర్మయ్య, శ్రీను, వెంకట్రాములు, చిన్నయ్య, పురుషోత్తం, కోటయ్య, నాగార్జున, చెన్నకేశవులు, చెన్నయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో ముదిరాజ్‌లు పోటీ చేయాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జిల్లా నాయకులు యాదయ్య, నర్సింహులు, వెంకట్రాములు, దయాకర్, రవీందర్, ఆంజనేయులు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన మైసమ్మ నామస్మరణ



నవాబ్‌పేట: మండలంలోని పర్వాతాపూర్ అడవిలో ఆదివారం మైసమ్మ దేవత నామస్మరణ మార్మోగింది. ఈ సందర్భంగా ఆలయం చెంత భక్తుల కోలాహలం కొనసాగింది. ఆదివారం పెద్దఎత్తున భక్తులు అడవిలో వెలసిన మైసమ్మ తల్లిని దర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకుని, నైవేద్యాలు సమర్పించారు. దీంతో అడవి మొత్తం కిటకిటలాడింది. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

జర్నలిస్టు కుటుంబానికి ఆర్థికసాయం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన జర్నలిస్ట్ దాసరి నర్సింహులు చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మహబూబ్‌నగర్ ప్రెస్‌క్లబ్ సభ్యులు ఆదివారం రూరల్ మండలంలోని చౌదర్‌పల్లిలో ఆయన ఇంటికెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రెస్‌క్లబ్ అండగా ఉంటుందని.. ధైర్యంగా ఉండాలని చెప్పారు. అనంతరం అంత్యక్రియలకు ప్రెస్‌క్లబ్ తరఫున రూ.15వేల ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నరేందర్‌చారి, ప్రధాన కార్యదర్శి నరేందర్‌గౌడ్, వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్, కోశాధికారి యాదయ్య, సంయుక్త కార్యదర్శులు సతీశ్‌కుమార్, మణిప్రసాద్, ఈసీ సభ్యులు మోహన్‌దాస్, రవికుమార్, రాంకొండ, రమణ, జర్నలిస్టు సాయికు మార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


అపూర్వ వేడుకకు హాజరైన అడ్డాకుల హైస్కూల్ పూర్వ విద్యార్థులు

అడ్డాకుల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989–90వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. 35ఏళ్ల తర్వాత కలుసుకున్న చిన్ననాటి మిత్రులు నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. తీపి గుర్తుల గురించి మాట్లాడుకుని ఒకరినొకరి యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఇందులో కేబీ సత్యనారాయణ పూర్వవిద్యార్థి పుట్టిన రోజు కావడంతో అక్కడే జన్మదిన వేడుకలను నిర్వహించారు. సుమారు 37మంది పూర్వ విద్యార్థులు సమ్మేళనంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో శివదేవాచారి, రమేష్, చంద్రశేఖర్, లక్ష్మీనర్సింహా, అన్వర్ పాషా, రాజగౌడ్, రజి త, భాగ్య, మంజుల, బాలింగ, పద్మ, రషీద్, షాహీన్, ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

46ఏళ్లకు.. ఆత్మీయ కలయిక

దేవరకద్ర: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1978–79 బ్యాచ్ లో ఎస్ఎస్‌సీ చదివిన పూర్వ విద్యార్థు లు ఆదివారం దేవరకద్రలో కలుసుకున్నారు. పూర్వ విద్యార్థులంతా ఒకచోట కలుసుకున్నారు. దాదాపు 46 ఏళ్ల క్రితం పాఠశాల లో జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పూర్వవిద్యార్థులంతా 60ఏళ్లు దాటినవారే కావడం విశేషం. కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ చైర్మన్ సీతాదయాకర్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు యజ్ఞభూపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, జడదీశ్వర్ రెడ్డి, రాములు, సాయిబాబా, జగదీశ్, శ్రీహరి, కృష్ణయ్య, శివశంకర్, జ్యోతి ప్రకాశ్‌రెడ్డి, మల్లికార్జున్, సుధాకర్‌రెడ్డి, రామేశ్వరమ్మ, విజయలక్ష్మి, శమంతకమణి, శ్రీదేవి, మణెమ్మ, సువర్ణ, సరళ పాల్గొన్నారు.


దేవరకద్రలో 46ఏళ్లకు కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఇంటిస్థలం ప్రతి ఉద్యోగి హక్కు

- ఫోర్త్ క్లాస్ ఉద్యోగుల సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్
- నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం
- కొత్త సభ్యులకు ఘన సన్మానం


కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఇంటి స్థలం ప్రతి నాలుగో తరగతి ఉద్యోగి హక్కు అని అందుకు కొత్త కార్యవర్గం కృషి చేస్తుందని నాలుగో తరగతి ఉద్యోగుల సహకార గృహ నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్ అన్నారు. ఆదివారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో ఉద్యోగుల సహకార గృహ నిర్మాణ సంఘం మహబూబ్‌నగర్ జిల్లాకు జరిగిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నికై యింది. ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సహకార గృహ నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఏ. నరేందర్, ఉపాధ్యక్షునిగా రఘురాం, కార్యదర్శిగా తిరుమలగిరిరామకృష్ణ, కోశాధికారిగా టి. రాజశేఖర్, డైరెక్టర్లుగా ఎల్లమ్మ, అన్నపూర్ణ, భాగ్యలక్ష్మి, మౌనిక, రాజులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాజశేఖర్ ప్రకటించారు. అనంతరం కొత్త కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతనగా ఎన్నికైయిన నాలుగో తరగతి ఉద్యోగుల సహకార గృహ నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని సర్వే నెంబర్ 380 ఉద్యోగులుకు ఇంటి స్థలాలు కేటాయించాలని సర్వే పూర్తి అయిందని అందుకు సంబంధించిన ఫైల్ సీసీఎల్ఏలో పెండింగ్‌లో ఉన్నదన్నారు. సీసీఎల్ఏలో ఫైల్ క్లియర్ అయిన వెంటనే అందరికి ఇంటి స్థలాలు వస్తాయని అన్నారు. తమ కార్యవర్గ తీర్మానం ప్రకారంలో సభ్యులైన 216 మందికి కేటాయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకట్రాములు, అనంతమ్మ, యాదయ్య, నవాజ్, శ్రీనివాసులు, అంజి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ను నిర్మూలించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: మాదకద్రవ్యాల నిర్మూలన మన అందరి బాధ్యత, యువతను వాటినుంచి కాపాడడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ఎస్పీ జానకి పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆదివారం డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల విద్యార్థులు, స్థానిక ప్రజలకు డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలు, చట్టబద్ధమైన పరిణామాల గురించి వివరించారు. ప్రచార ర్యాలీలు, పోస్టర్ ప్రదర్శనలు, బహిరంగ సమావేశాల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్‌శాఖ ప్రతి గ్రామం , స్కూళ్లలో అవగాహన కల్పించే లక్ష్యంతో పని చేస్తుందని తెలిపారు.

నేడు వికసిత్ భారత్ సంకల్ప సభ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రూరల్ మండలంలోని మాచన్‌పల్లిలో ఈనెల 23వ తేదీ ఉదయం 10గంటలకు వికసిత్ భారత్ సంకల్ప సభ నిర్వహించనున్నట్లు బీజేపీ రూరల్ మండలాధ్యక్షుడు బొంగు గంగన్న ప్రకటనలో తెలిపారు. ఎంపీ డీకే అరుణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

'పీఆర్‌సీలను వర్తింపజేయాలి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వివక్ష లేకుండా పీఆర్‌సీలు వర్తింపజేయాలని పింఛనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్ ఆదివారం సంయుక్త ప్రకటనలో కోరారు. ఈ మేరకు సంతకాల ఉద్యమం చేపడుతున్నామని, ఈనెల 23న ఉదయం 10:30 గంటలకు జిల్లాలోని పింఛన్‌దారులు కలెక్టరేట్‌కు చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు. పదవీ విరమణ బకాయిలను సత్వరమే విడుదల చేయాలని, నగదురహిత వైద్య సేవల విధివిధానాలు రూపొందించాలన్నారు.

శీతలాదేవి ఆలయ అభివృద్ధి కమిటీ ఎన్నిక

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాతపాలమూరులోని శీతలాదేవి ఆలయ, నాగులకట్ట అభివృద్ధి కమిటీకి ఆదివారం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుగుణాకర్, ఉపాధ్యక్షుడిగా శాంతయ్య, ప్రధాన కార్యదర్శిగా రామాంజనేయులు, సహాయ కార్యదర్శిగా గిరి, కోశాధికారిగా మోహన్‌బాబు, కార్యవర్గ సభ్యులుగా రాణి, నాగరాజు ఎన్నికయ్యారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని కంచికామకోటి పీఠం పాలమూరు శాఖ శ్రీవేంకటేశ్వరస్వా మి ఆలయంలో వార్షికోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మూడోరోజు ఆదివారం స్వామివారికి ప్రాతఃకాల సమయంలో సుప్రభాతసేవ, మండపదేవతా పూజలు, మూలమంత్ర అనుష్టానములు, హనుమత్ వాహనంపై స్వామివారిని ఊరేగింపు నిర్వహించారు. గోవిందనామంతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యాన్ని చాటింది. బ్రహ్మోత్సవాల్లో శ్రీవెంకటేశ్వర సేవా మండలి అధ్యక్షుడు శ్రీకాంత్‌శర్మ, ప్రధాన కార్యదర్శి రాఘవేంద్రశర్మ, సుదర్శన్‌గౌడ్, ఆంజనేయులు, భీమాచార్యులు, శ్రీచంద్రశేఖర వేదపాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా బర్హానే బాదేషా దర్గా ఉత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం ఎర్రకుంట సమీపంలోని బాదేషా బౌలిలోని హజ్రత్ బర్హానే బాదేషా రహెమతుల్లా అలై దర్గా ఉర్సే షరీఫ్ వేడుకలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన గంథోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక వీరన్నపేటలోని మక్కా మజీద్ నుంచి గంథోత్సవ ఊరేగింపు ప్రారంభమై మదీనా మజీద్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ రోడ్, క్లాక్ టవర్, పాన్‌చౌరస్తా మీదుగా దర్గా వరకు నిర్వహించారు. నారే తగ్బీర్ నినాదాలతో దర్గా వరకు గంథోత్సవ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దర్గాలో పూలు, చాదర్లు సమర్పించి ప్రత్యేక ఫాతేహాలు ఇచ్చారు. రాత్రి ఖవ్వాలి నిర్వహించారు. సోమవారం దీపారాధనతోపాటు కవి సమ్మేళనం ఉంటుందని ముతవల్లీ డాక్టర్ గయాజ్‌పాషా ఖాద్రీ హకం షర్ఫీ తెలిపారు. ఉత్సవాల్లో జిల్లా కేంద్రంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గంథోత్సవ వేడుకల్లో సయ్యద్ చందా హుస్సేని, హాఫిజ్ వారిస్ ఖాద్రీ, జహంగీర్‌పాషా ఖాద్రీ, యూసుఫ్, సమద్ షర్ఫీ, షాకీర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

వానొస్తే.. వరదే!



కోయిల్‌కొండ: మండలంలోని పారుపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణ వానొస్తే వర్షపు నీరు చేరి కుంటును తలపిస్తోంది. మురుగు కాల్వల నిర్మాణం సరిగ్గా లేకపోవడంతో నీరంతా పాఠశాల ఆవరణలోకి చేరి బయటికి వెళ్లలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీని పునః నిర్మించి నీటిని మళ్లిస్తే సమస్య తీరుతుందని తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని నూతనంగా నిర్మించాలని కోరుతున్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి

జడ్చర్ల టౌన్: జూలై 9న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం జడ్చర్లలో నిర్వహించిన సీఐటీయూ జిల్లా కార్యదర్శివర్గ సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను వేగవంతంగా అమలు చేయాలని చూస్తుందని ఆరోపించారు. 29కార్మిక చట్టాలు రద్దు చేసి నాలుగు లేబర్‌కోడ్‌లు అమలు చేయాలని చూస్తుందని.. కార్మిక వర్గాలు పోరాడి సాధించుకున్న హక్కులు లేకుండా పోతాయన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ దేశంలో ఉన్న కార్మిక సంఘాలన్నీ జూలై 9న సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. సమ్మెలో ప్రతి కార్మికుడు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో భాగంగా సమ్మె జయ ప్రదం చేసేందుకు జిల్లాలోని అన్ని కార్మిక సంఘాలను ఏకం చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి, అధ్యక్షుడు దీప్లానాయక్, సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య, నాయకులు చంద్రకాంత్, రాజ్‌కుమార్, ఖమర్ అలి పాల్గొన్నారు.

క్లుప్తంగా

హ్యాండ్‌బాల్ క్రీడాకారుడికి మంత్రి సన్మానం



మహబూబ్‌నగర్ క్రీడలు: మస్కట్‌లో ఈ ఏడాది మే 5 నుంచి 16 వరకు నిర్వహించిన 10వ ఏషియన్ పురుషుల బీచ్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొన్న జిల్లా క్రీడాకారుడు ఆసిఫుల్లా బేగ్‌ను ఆదివారం హైదరాబాద్‌లో యువజన, క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి అభినందించారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు.కార్యక్రమంలో ఎండి.జియావుద్దీన్, పీడీలు బాల్‌రాజు,రవికుమార్,రఘు పాల్గొన్నారు.

43 వారాలుగా ఉచిత భోజనం



నవాబ్‌పేట: మండల కేంద్రంలో ప్రతి ఆదివారం సంతకు వచ్చేవారికి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహాచారి ఉచిత భోజనం అందిస్తున్నారు. కాగా పదినెలలుగా సంతకు వచ్చినవారు నేటికి 43వ వారంతో 21,379 మంది భోజనం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగే సంతకు పరిసరాల్లోని దాదాపు 70గ్రామాల ప్రజలు వస్తుంటారు.దీంతో ఉచిత భోజన కార్యక్రమం వారికి ఆసరగా నిలిచిందని చెప్పవచ్చు.

ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు



భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌లో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో, ఆప్టే స్మారక సమితి పాలమూరు వారిచే ఉచిత కంటి పరీక్షలు విజయవంతంగా నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ వందేళ్ల సందర్భం స్థానిక దయానంద విద్యామందిర్ పాఠశాలలో 185 మందికి పరీక్షలు నిర్వహించగా 59 మందికి కంటి అద్దాలు, ఉచిత మందులను పంపిణీ చేశారు. 121మంది కంటి ఆపరేషన్ అవసరం ఉందని గుర్తించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘ చాలక్ వసంతం వెంకటేశ్వర్లు, ఆప్టే స్మారక సమితి సభ్యులు బలరాం, భరతయ్య, శ్యాంసుందర్, మహానంది, శ్రీనివాసులు, రాజశేఖర్, భాస్కర్, చెన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యనందించాలి



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: అందరికీ మెరుగైన విద్యను అందించాలని మాలల చైతన్య సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కేశవులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులతో విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని ఆరోపించారు. ఆయా పాఠశాలలు, కళాశాలల్లో ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహించాలని, బుక్స్, టై బెల్టులు యాజమాన్యం విక్రయించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు యాదయ్య, వెంకట్రాములు, యాదగిరి, సైదులు, నర్సింహ, నిరంజన్ పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు

నవాబ్‌పేట: దాడి ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. కొల్లూర్‌కు చెందిన వేణుగోపాల్ అదే గ్రామానికి చెందిన వెంకటయ్యతో ఈ నెల 18న ఆయన కూతురు ఫోన్లో మాట్లాడిన విషయాన్ని తెలియజేయగా.. ఫోన్ లాక్కున్నారు. ఫోన్ ఇవ్వాలని కోరగా.. వెంకటయ్యతోపాటు అతని బంధువులు కలిసి వేణుగోపాల్‌పై దాడి చేసి గాయపర్చారు. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేసుకుని ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసినట్లు వివరించారు.

వ్యక్తి అదృశ్యం

జడ్చర్ల: మున్సిపాలిటీ పరిధిలోని నాగసాలకు చెందిన మాదిరెడ్డి యాదిరెడ్డి(60) శనివారం ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదని భార్య హైమావతి ఫిర్యాదు చేసినట్లు సీఐ కమలాకర్ తెలిపారు. తన మొబైల్ ఫోన్‌ను ఇంట్లోనే వదలి రూ.6వేలు నగదు తీసుకుని బయటకు వెళ్లాడని, చుట్టుపక్కల బంధువుల వద్ద వెతికినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.